క్లుప్తంగా

కారుణ్య నియామకాలు చేపట్టండి



కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసిన ఎస్టీయూ నేతలు

కర్నూలు(సెంట్రల్): జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని పశ్చిమ ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టీకే జనార్ధన్ కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. మంగళవారం వారు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలసి విన్నవించారు. మొత్తం 86 కారుణ్య నియామకాలకుగాను 36 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా కారుణ్య నియామకాలు ఇచ్చారని, మిగతా వారికి కూడా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అలాగే జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో బాలబాలికలకు సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో సీట్లను పెంచాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. నాయకులు గాజులు నాగేశ్వరరావు, ధనుంజయనాయుడు, అజంబేగ్ పాల్గొన్నారు.

'ఆశా'లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, కర్నూలు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.రంజాబీ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షురాలు దస్తగిరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రోజుకు 10 గంటలు పనిచేయించుకొని వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.చంద్రశేఖర్, కృష్ణమూర్తి, టి.రామాంజనేయులు, నాగవేణి, కొండమ్మ, పద్మ పాల్గొన్నారు.

పరేడ్‌లో ప్రతిభ చాటాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ తెలుగు రాష్ట్రాల రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ

కర్నూలు కల్చరల్: వెస్ట్ జోన్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ ఎంపికల్లో రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిభ చాటాలని రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. మంగళవారం ఆర్‌యూలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక జరిగింది. రెక్టార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆర్‌యూ విద్యార్థుల ప్రాతినిధ్యం ఉండాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, ఎన్ఎస్ఎస్ ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రామకృష్ణ మాట్లాడారు. అనంతరం వలంటీర్లను ఎంపిక చేశారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు బీవీ శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ నాగచంద్రుడు, డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ విజయుడు, పీడీ డాక్టర్ శివకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు తక్షణమే వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో 12 సంవత్సరాల నుంచి అంగన్‌వాడీలకు గౌరవ వేతనాలు పెంచడం లేదన్నారు. రోజురోజుకు పని భారం ఎక్కువ అవుతున్నా వారి ఊరట నిచ్చేలా జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నాయకులు చంద్రశేఖర్, కె.చౌడేశ్వరి, మంజుల, పార్వతి, రత్నమ్మ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : లిటిల్ హార్ట్స్, మదరాసి, ది కంజ్యూరింగ్ : లాస్ట్ రైట్స్, ఘాటి, కొత్త లోక : చాప్టర్ 1 – చంద్ర, మహావతార్ నరసింహ, భాగీ 4

వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : లిటిల్ హార్ట్స్, ది కంజ్యూరింగ్ : లాస్ట్ రైట్స్, ఘాటి, కొత్త లోక : చాప్టర్ 1 – చంద్ర, కూలీ

వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : మదరాసి, లిటిల్ హార్ట్స్, ఘాటి, కొత్త లోక : చాప్టర్ 1 – చంద్ర

శ్రీరామ : లవ్ యు రా

రాజ్ : ది కంజ్యూరింగ్ : లాస్ట్ రైట్స్

భరత్ కాంప్లెక్స్ : భాగీ 4, కూలీ

విజయ : వార్ 2

విక్టరీ : వార్ 2

- అన్నదాతలను దగా చేస్తున్న చంద్రబాబు సర్కార్
- యూరియా కోసం పడిగాపులు
- ఆత్మహత్యకు యత్నించిన రైతులపైనే కేసులు పెట్టడం సిగ్గుచేటు
- కర్నూలు, పత్తికొండ, ఆదోనిలో రైతులతో భారీ ర్యాలీ

రైతాంగ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి, బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కోట్ల హర్ష, అహ్మద్ అలీఖాన్, విజయమనోహరి, సిద్ధారెడ్డి రేణుక తదితరులు



కర్నూలు ఆర్డీఓ కార్యాలయ ఏఓ వేణుగోపాల్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): రైతాంగ సమస్యలు పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని, వారి సమస్యలు పరిష్కరించే వరకు రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరుబాట కొనసాగుతుందని ఆ పార్టీ కర్నూలు పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఆదోని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానికంగా రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీలు నిర్వహించారు. కర్నూలులో పార్టీ శ్రేణులు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాలు చేతబట్టి 'సీఎం డౌన్.. డౌన్', 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి', రైతులను ఆదుకోవాలన్న డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్నూలులో వైఎస్సార్ సర్కిల్ నుంచి పాత పోలీసు కంట్రోల్ రూమ్, కొండారెడ్డి బురుజు, ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. వరి, ఉల్లి పైరు, యూరియా సంచులను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఆదోని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అలాగే పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులపై కేసులు పెట్టిన ప్రభుత్వానికి పోయే కాలం దాపురించిందన్నారు. కర్నూలు మేయర్ బీవై రామయ్య, పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ మాట్లాడారు. అనంతరం పార్టీ నేతలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పరిపాలన అధికారి వేణుగోపాల్‌కు రైతు సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వంగాల భరత్ కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిద్దారెడ్డి, రేణుక, నగర అధ్యక్షుడు అహమ్మద్ ఆలీఖాన్, యువత అధ్యక్షుడు శివారెడ్డి, హనుమంతరెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి, సిట్రా సత్యనారాయణమ్మ, కల్లా నాగవేణి రెడ్డి, కార్పొరేటర్లు మునెమ్మ, అరుణ, పల్లవి, షేక్ అహమ్మద్, జుబేర్, షాషావలీ, పార్టీ నేతలు షరీఫ్, రాఘవేంద్ర నాయుడు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌లో రాణించాలి



టెన్నికాయిట్ పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో రాణించాలని స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్, న్యాయవాది జి.శ్రీధర్ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఏ.క్యాంపులోని నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రాంగణంలో టెన్నికాయిట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన సర్వీస్ చేసి ప్రారంభించారు. అనంతరం మట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. టెన్నికాయిట్ జిల్లా కార్యదర్శి రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు వరలక్ష్మి, సురేష్ పాల్గొన్నారు.

15న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్టేట్ లెవల్ ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 7 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సాయి సెంటర్ ఇన్‌చార్జ్ కార్తికేయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008 – 2013 మధ్య జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. గోల్ కీపర్ ఎత్తు, లెఫ్ట్ హ్యాండ్ క్రీడాకారుల ఎత్తు 175 సెంటీమీటర్లు ఉండాలని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, 10వ తరగతి మార్క్‌లిస్టు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు సెంటర్ ఇన్‌చార్జ్ 87547 29345 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

క్వార్టర్లను ఖాళీ చేసేందుకు గడువివ్వాలి



ధర్నా చేస్తున్న ఏ, బీ, సీ క్యాంపు క్వార్టర్ల మహిళలు

కర్నూలు(అర్బన్): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లో అనధికారికంగా నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల పట్ల ఆయా క్యాంపులకు చెందిన మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజే శ్వరి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఇక్కడే నివాసం ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలంటే ఎక్కడికి పోతారన్నారు. కొంత గడువు ఇస్తే ఖాళీ చేస్తామని ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు తెలియజేశామన్నారు. అయితే కొన్ని రాజకీయ శక్తుల ప్రమేయం వల్ల ఆయా క్యాంపుల్లోని వందల గృహాలకు విద్యుత్, నీటి సరఫరాను నిలిపి వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. క్వార్టర్లను ఖాళీ చేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు.మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు సీమకృష్ణ, వై.రాజు, రవికుమార్, రంగమునినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతలో ఆత్మన్యూనతా భావం



సైకియాట్రిక్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లోకేశ్వరరెడ్డితో మెడికల్ కాలేజీ సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): నేటి యువతలో ఆత్మహత్యా ప్రయత్నాలు అధికమయ్యాయని ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లోకేశ్వరరెడ్డి చెప్పారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులు ఆత్మహత్యల నివారణపై ప్లకార్డులు, పోస్టర్లతో అవగాహన మారథాన్ నిర్వహించారు. అనంతరం ఆత్మహత్యల నివారణపై ప్రముఖులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక జీవితంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మానసిక ఒత్తిడి, పరీక్షల ఒత్తిడి, కుటుంబ, ఆర్థిక సమస్యలు, మానసిక రుగ్మతలు ఆత్మహత్యలకు దోహదం చేస్తాయన్నారు. ఆత్మహత్య ఆలోచనలతో ఉన్న వారిని అర్థం చేసుకోవడం, వారి సమస్యలను వినడం మానసిక చికిత్సను సూచించడం వంటివి ఆత్మహత్యలను తగ్గించడంలో సహాయపడతాయని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణనాయక్, డాక్టర్ మునీరుద్దీన్ అహ్మద్, సైకియాట్రిస్టులు మయూరనాథ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, అభిషేక్, వీరేంద్ర, పీజీలు పాల్గొన్నారు.

యూరియా అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న రోజా మహిళా ఐక్య సంఘం సభ్యులు

కర్నూలు (సెంట్రల్): యూరియా అక్రమ నిల్వలపై పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్, వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని రోజా ఐక్య మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి యూరియా కొరతను నివారించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ రైతులకు యూరియా అందకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమ నిల్వలపై దాడులు చేయాలన్నారు. లేదంటే రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యే అవకాశముందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సోపుటప్ చర్యలు మాని క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో రాముడు, నాగప్ప, కర్రెమ్మ, నారాయణమ్మ, పార్వతమ్మ, ముంతాజ్ పాల్గొన్నారు.

'జగదేక సుందరి సామ'కు అవార్డులు



ఉత్తమ నాటకం అవార్డు అందుకుంటున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'జగదేక సుందరి సామ' పద్య నాటకానికి జాతీయ స్థాయిలో బహుమతులు వరించాయి. అనంతపురంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు శ్రీకృష్ణ కళా మందిరంలో సత్య సాయి సేవా సమితి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో పద్య నాటక పోటీలు జరిగాయి. ఇందులో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన 'జగదేక సుందరి సామ' పద్య నాటకం పోటీల్లో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. ఈ నాటకాన్ని కీర్తిశేషులు లక్ష్మీ కులశేఖర్ రచించగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించారు. ఉత్తమ నాటకంతో పాటు పత్తి ఓబులయ్యకు ఉత్తమ దర్శకత్వం, జీవీ శ్రీనివాసరెడ్డికి ఉత్తమ నటుడు, సురభి ప్రభావతికి ఉత్తమ నటి, కె.బాలవెంకటేశ్వర్లుకు ఉత్తమ పాత్ర అవార్డులు దక్కాయి. అనంతపురంలో జిల్లా రెవెన్యూ అధికారి మలోల, సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు మైఖేల్‌బాబు, సీనియర్ రంగ స్థలం నటుడు బాలాజీ నాయుడు మంగళవారం వారికి బహుమతులు అందజేశారు. కళాక్షేత్రం సభ్యులు సంగా ఆంజనేయులు, మహమ్మద్ మియ్యా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత గోరంట్ల, రవీంద్ర జట్లు



కప్పు అందుకుంటున్న రవీంద్ర స్కూల్ జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి అండర్–12 హ్యాండ్‌బాల్ పోటీల్లో గోరంట్ల ఏపీ రెసిడెన్షియల్ (బాలుర విభాగం) రవీంద్ర స్కూల్ జట్టు (బాలికల విభాగం) విజేతలుగా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు కప్పులు, మెడల్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాలుర విభాగంలో ఆరు జట్లు పోటీ పడ్డాయన్నారు. ఏపీ ఉర్దూ విద్యా సంస్థ రెండవ స్థానం, బాలికల విభాగంలో డోన్ కేజీబీవీ రెండవ స్థానంలో నిలిచాయి. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సువర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, పద్మలత, డోరతి, నాగన్న, సునీల్, నాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రోజూ 500 మెట్రిక్ టన్నుల ఉల్లిని తరలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి మార్కుఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిని రోజుకు కనీసం 500 మెట్రిక్ టన్నులు ఇతర ప్రాంతాల మార్కెట్లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి కొనుగోళ్ల కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఉల్లి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. రైతుల నుంచి ఆధార్, బ్యాంకు అకౌంట్ తదితర వివరాలను తీసుకొని ఉల్లిని కొనుగోలు చేయాలన్నారు. ఉల్లి పంటకు కనీస మద్దతు ధర రూ.1200 ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ యార్డుకు వచ్చే ఉల్లి క్షేత్ర స్థాయి నుంచే వస్తోందా? ఏమైనా రీసైక్లింగ్ జరుగుతోందా అని పరిశీలించేందుకు ఐదుగురు అధికారులను మార్కెట్ యార్డుకు పంపాలని హార్టికల్చర్ అధికారిని ఆదేశించారు. ఉల్లి పంటను తీసుకొచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ బి.డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డు నుంచి రోజుకు 200 టన్నులు తాడేపల్లిగూడెం, 200 టన్నులు హైదరాబాద్, రైతు బాజార్లకు 80 టన్నులను పంపుతున్నట్లు చెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లో మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, మార్కెటింగ్ ఏడీ నారాయణ మూర్తి, మార్కు ఫెడ్ డీఎం రాజు, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, మార్కెట్ సెక్రటరీ జయలక్ష్మీ పాల్గొన్నారు.

రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తే చర్యలు

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవలకు అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆసుపత్రి యాజమాన్యాలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్‌టీఆర్ వైద్య సేవలకు సంబంధించి ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రికి ఎవరైనా రోగులు వచ్చినప్పుడు ముందుగా ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద ఎన్‌రోల్ చేసి ఓపీ ఉచితంగా చూడాలని సూచించారు. నగరంలోని అమీలియో, ఎస్ఆర్ఎం, స్టార్ కేర్, ఒమెగా ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ సేవల కింద రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. సమావేశానికి హాజరు కాని ఎస్ఆర్ఎం ఆసుపత్రికి నోటీసులు ఇవ్వాలని ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలకు సంబంధించి డీఓ లెటర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీఎస్ఎస్‌వీ భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా పాల్గొన్నారు.

సీపీఎం నేతకు నివాళి

కర్నూలు(సెంట్రల్): సీపీఎం సీనియర్ నాయకుడు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా నాయకులు జేఎస్ శేషయ్య గుండెపోటుతో మరణించడం బాధకరమని సీఐటీయూ న్యూసిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహులు, నగర అధ్యక్షుడు వై.నగేష్ పేర్కొన్నారు. వారు మంగళవారం ఆయన మృతి విషయం తెలుసుకొని ఆఫీసు బేరర్లు జి.ఏసు, ఎస్.హుస్సేన్‌వలి, ఎస్.షంషీర్‌బాషా, శ్రీనివాసులులతో కలిసి ఆయన భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారు మాట్లాడుతూ.. జేఎస్ శేషయ్య కల్లూరు ఉప సర్పంచ్‌గా, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడిగా, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జిల్లా నాయకుడిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు.

సాంస్కృతిక రంగానికి తీరని లోటు

కర్నూలు కల్చరల్: సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్, సీపీఎం నాయకులు జేఎస్ శేషయ్య మృతి సాంస్కృతిక, సాహిత్య రంగాలకు తీరని లోటని టీజీవీ కళాక్షేత్ర అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, చక్రపాణియాదవ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన శేషయ్య (68) భౌతిక కాయం వద్ద మంగళవారం శ్రద్ధాంజలి ఘటించి సంతాపం ప్రకటించారు. పలువురు ప్రజా సంఘాలు, కళా సంస్థలు, సాహిత్య సంస్థలు, కుల సంఘాల నాయకులు శేషయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు: కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశుసేవా పథక అధికారిణి అనురాధమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోపు బి.క్యాంపు, డీఐజీ బంగ్లా సమీపంలోని కర్నూలు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత, ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత అర్హతగా పేర్కొన్నారు. కర్నూలుకు సంబంధించి 5వ వార్డు వీబీ స్ట్రీట్–1 అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త పోస్టు ఖాళీగా ఉంది. ఆయా పోస్టులకు సంబంధించి 5వ వార్డు, వీబీ స్ట్రీట్–2 కేంద్రం, 46వ వార్డు, నరసింహారెడ్డి నగర్–2 కేంద్రం, 18వ వార్డు, జొహరాపురం–5 సెంటర్లు ఖాళీగా ఉన్నాయి, ఇక పాణ్యం నియోజకవర్గంలో కార్యకర్త పోస్టు కల్లూరు మండలం, దొడ్డిపాడు అంగన్‌వాడీ కేంద్రం, ఆయా పోస్టులు 28వ వార్డు, లక్ష్మీపురం–1, 32వ వార్డు, ముజఫర్‌నగర్–2, 28వ వార్డు, పందిపాడు–2, 37వ వార్డు, వీకర్‌సెక్షన్ కాలనీ–1 కేంద్రాలు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటండి



క్రీడాకారులను అభినందిస్తున్న జి.శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): సెపక్ తక్రా జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో నిర్వహిస్తున్న 28వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్, సీనియర్ విభాగంలో జిల్లా స్థాయిలో సెపక్‌తక్రా పోటీలు నిర్వహించారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెపక్‌తక్రా క్రీడాంశంలో కర్నూలు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బాలికల జట్టులో ఆకాంక్ష, నక్షత్ర, భూమిక, మాధవి, జ్యోత్స్న బాలుర జట్టులో వరుణ్ కుమార్, మాలా హుస్సేన్, సమీర్ బాష, సుహాన్, సుశిత్ ఎంపికైనట్లు ప్రకటించారు.

వైద్య విద్యార్థినికి గోల్డ్‌మెడల్



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ నమ్రత

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించి రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిచిన డాక్టర్ పి.నమ్రతకు పురస్కారం లభించింది. సోమవారం నిర్వహించిన విజయవాడలోని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ (న్యూఢిల్లీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఓపీ యాదవ్ చేతుల మీదుగా పురస్కారం, మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు. 2018లో కేఎంసీలో ఎంబీబీఎస్‌లో చేరిన నమ్రత 2023లో నిర్వహించిన చివరి సంవత్సరం పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచి మెడల్ సాధించారు. ఆమెతో పాటు డాక్టర్ కావూరి హైమావతి, డాక్టర్ కావూరి చలపతిరావు సైతం ఉత్తమ ప్రతిభ కనపరిచారు. వారు కూడా అతిథుల చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు. ఆప్తమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ నివేదిత కుమార్తె అయిన డాక్టర్ నమ్రత ప్రస్తుతం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో పీడియాట్రిక్ ఎండీ అభ్యసిస్తోంది.

హత్యకేసులో మరో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కర్నూలు: నగరంలోని కొత్తపేటకు చెందిన బంగారు నగల తయారీదారుడు షేక్ ఇజహర్ అహ్మద్ (45) హత్యకేసులో మరో ఇద్దరు నిందితులు ఇమ్రాన్, యూసుఫ్‌లను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. రెండు కుటుంబాల మధ్య గొడవల కారణంగా షేక్ ఇజహర్ అహ్మద్ ఈనెల 1వ తేదీన రాధాకృష్ణ థియేటర్ వద్ద ఉన్న మసీదు బయట హత్యకు గురయ్యాడు. హతుడి తండ్రి షేక్ గౌస్ నిసార్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఐదుగురు వ్యక్తులకు హత్యలో ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేల్చారు. గనీగల్లీకి చెందిన షేక్ ఇమ్రాన్, మొగల్‌పుర వీధికి చెందిన ఎస్ఎండీ ఇర్ఫాజ్, ఖడక్‌పుర వీధికి చెందిన షేక్ జహీర్ అహ్మద్‌లను ముందు రోజు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా పరారీలో ఉన్న ఇమ్రాన్, యూసుఫ్‌లు తుంగభద్ర నది ఒడ్డున కోట వీధి రాఘవేంద్ర ఘాట్ వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో మంగళవారం ఇద్దరినీ అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఒకటో పట్టణ సీఐ పార్థసారథి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ నాగప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండ్ ప్రాంతంలోని షరాఫ్ బజార్, హెడ్ పోస్టాఫీసు, మున్సిపల్ హైస్కూల్, పార్కు ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.